


# శ్రీపతి

కౌశీనాథ & కాశీనాథ

[illegible]

'అమ్మాయ్ బావ వచ్చాడు కాళ్లకి నీళ్లియ్యి' అని కేక వేసింది కామాక్షమ్మ.

వర్ధని కొంచెం తటపటాయించింది. బావిలో నీళ్లతోడి చెంబుతో తెచ్చి గుమ్మం పక్కన పెట్టి బావ వచ్చేటప్పటికి తప్పుకుంది.

శ్రీపతి కాళ్లు కడుక్కుని చెంబు కింద పెడుతూ వర్ధని అక్కడ ఉందేమోనని చూశాడు. వర్ధని కనబడలేదుగాని ఆ అమ్మాయి వోణీ అంచు కనిపించింది. చేతులు కదిలితే గాజులు చప్పుడవుతున్నాయి.

'ఏమిటవి చేతిలో' అన్నారు జగన్నాథం గారు ఆయన శ్రీపతికి వరసకి మేనమామ. వర్ధని తండ్రి.

'ఫొటోలు, అప్లికేషనులో ఫొటో కావాలన్నారు' అన్నాడు.

'ఎప్పుడు పంపించాలి?'

'ఇవాళ పంపిస్తేనే టైముకి అందుతుంది'

'సరే ఆలస్యం చెయ్యకుండా పంపించు' అనేసి ఆయన బయటికి వెళ్లిపోయాడు.

వర్ధనికి బావ ఫొటో చూడాలని మనసయింది. చెల్లెలు సీతని పిలిచి 'బావనడిగి ఫొటో పట్టుకు రావే' అంది. సీత శ్రీపతి దగ్గరకి వెళ్లేసరికి శ్రీపతి ఫొటో చూస్తున్నాడు.

ఫొటో బాగానే వచ్చింది. కాని నుదుటిపైన జుట్టులో క్రుడి బాగా పడలేదు. మామూలుగా చూడటానికి నుడి దగ్గర జుట్టు వంపు తిరిగి చాలా బాగుంటుంది. శ్రీపతి అందగాడు కాబట్టి ఇంకా రాణిస్తుంది.

'అక్క ఫొటో యిమ్మంది' అంది సీత.

"మీ అక్కనే రమ్మను. వస్తే యిస్తాను" అన్నాడు శ్రీపతి. సీత లోపలికి వెళ్లి అరక్షణంలో తిరిగి వచ్చింది, 'ఇవ్వకపోతే దాచుకోమను' అంది అక్కయ్య' అంది.

శ్రీపతి నవ్వుతున్నాడు.

వర్ధని కనిపిస్తే పలకరిద్దామనుకున్న శ్రీపతికి ఆరోజల్లా ఆమె కనబడలేదు. సీతే ఒకటికి పదిసార్లు కనిపించింది.

ఆ సాయంత్రం పందిరి దగ్గర బంతి మొక్కదగ్గర సీత ఆడుకుంటోంటే 'నాకో బంతిపువ్వు కోసియ్యి' అన్నాడు శ్రీపతి [illegible]

[illegible]

'అమ్మో ఆశ' అంది సీత చేతులు తిప్పుకుంటూ.

'ఊరికే. కాసేపు వాసన చూసుకుని ఇచ్చేస్తాను' అన్నాడు.

చిన్న పిల్లలకి ఇలాంటి విషయాలలో పంతం. అందులోనూ ఆ బంతి మొక్కకి అదేరోజా నీళ్ళుపోసింది.

సీత ఇవ్వనన్నాక శ్రీపతి నవ్వి లోపలికి వెళ్ళిపోయాడు. కాసేపాగి బజారు వెడదామని బట్టలు వేసుకుంటోంటే సీత వచ్చింది.

'ఇదిగో పూలు' అంటూ నాలుగు బంతి పూలు టేబులుమీద పెట్టింది.

'ఇందాక ఇవ్వనన్నావుగా' అన్నాడు శ్రీపతి కుతూహలంగా.

'మా అక్క ఇమ్మంది' అంది సీత నవ్వి.

శ్రీపతి పెదవులమీదికి చిరునవ్వు వచ్చింది. హృదయం అంతటా వెన్నెల పరుచుకుంది. ఆ నాలుగు బంతిపూలు వాసన చూస్తూంటే ఒళ్ళు తేలిపోతున్నట్లనిపించింది. 'శ్రీపతి—వర్ధని' రాశాడు దినపత్రికమీద. మళ్ళీ ఎవరైనా చూస్తారని కొట్టేశాడు.

* * *

ఆ సాయంత్రం లక్ష్మీపురం ప్రయాణం పెట్టుకున్నాడు శ్రీపతి. ఆ సంగతి మామయ్యతో చెబుతోంటే విని తలుపుకు దగ్గరగా జరిగింది వర్ధని.

'మీ అమ్మదగ్గర ఎన్నాళ్ళుంటావు?' అన్నాడు జగన్నాథంగారు.

'నెల అయినా ఉంటాను'

'అక్కడినుంచి ఏ పిన్ని దగ్గరకికూడా వెళతావా?' అంది కామాక్షమ్మ. ఆ గొంతులో చిరాకు, అసహనం ఉన్నాయి పుల్లవిరిచినట్లు ఉంది ఆ మాట.

'ఆ' అన్నాడు శ్రీపతి

అత్తయ్య, ముఖకవళికలు గమనించి కొంచెం బాధ పడ్డాడు. అందుకే ఆమె దగ్గర శ్రీపతికి చనువు తక్కువ.

ఆవిడ తీరే అంత. భర్త మెతక దనం కొంత కారణం. ఆ యింటో ఆవిడదే ఆధిపత్యం. ఆమె యిష్టమే చెల్లుతుంది సామాన్యంగా. కొన్ని కొన్ని సమయాలలో ఆయన ఎదురు తిరుగుతాడు. అయితే ఆయనలో ఎప్పుడు ఆ చలనం వస్తుందో చెప్పలేము.

ఆవిడ పక్కా 'డబ్బు మనిషి' బంధుత్వాలకి అంతగా విలువ యివ్వదు. లలితమ్మనీ, అనసూయమ్మనీ కూడా ఒక్కలాంటి మమతతోటే చూసుకుంటూ, ఎవరికి బాధ కలిగినా విలవిలలాడే ఆప్యాయత పెంచుకున్నాడని కోపం.

తల్లి గుణాలేవీ కూతురికి రాలేదు. వర్ధని గుణవంతురాలు. స్వచ్ఛమైన స్ఫటికం లాంటి రూపం వర్ధనిది. పదహారేళ్ళ వయసు. శ్రీపతికి నచ్చే అందం. ఒక్కొక్కసారి చీరలూ, ఒక్కొక్కసారి వోణీలూ కడుతుంది.

వర్ధనికి బావ శ్రీపతిని చేసుకోవాలని కోరిక. కామాక్షమ్మకిమాత్రం కూతుర్ని తన అన్నయ్య కొడుక్కి ఇవ్వాలని కోరిక. అతను బాగా స్థితిమంతుడు,

శ్రీపతి బట్టలు సర్దుకుంటోంటే చప్పుడయి వెనక్కి తిరిగిచూశాడు. వర్ధని గుమ్మం దగ్గర తలుపుకానుకుని నిలబడి ఉంది.

'లోపలికి రా' అన్నాడు శ్రీపతి. నెమ్మదిగా లోపలికి వచ్చింది.

'సాయంత్రం వెడుతున్నావా?' అంది వోణీ కొంగు వేలికి చుట్టుకుంటూ.

'ఊ'

'మళ్ళీ ఎప్పుడు రావటం?'

'ఒక నెల రోజులు పడుతుంది.'

వర్ధని మాట్లాడ లేదు కాలి బొటన వేలితో నేలనిరాస్తూ కూర్చుంది.

'ఫోటో చూస్తావా?' అన్నాడు శ్రీపతి ఆమెని ఉత్సాహ పరచడానికి. వర్ధని తల వూపింది. పెట్టెలోంచిఫోటోలు పెట్టినకవరు తీశాడు అందులో రెండు ఫోటోలున్నాయి.

'మూడు కాపీలు తీయించుకున్నాను ఒకటి అప్లికేషనులో పెట్టాను' అన్నాడు

'నాకు ఒకటియ్యి' అంది,వర్ధని బిడియ పడుతూ.

'ఇంకోసారిస్తాలే'

'ఇప్పుడిస్తే నీకేం?'

'ఒకటి మా అమ్మకివ్వాలి'

'రెండోది?'

'మా అమ్మకివ్వాలి'

అతనికి ఇద్దరు అమ్మలని తెలుసు కాబట్టి సరేనంది వర్ధని.

*

శ్రీపతి తాతగారు శ్రీపతి-రిది లేని కుటుంబం కాకపోయినా అంతగా బాగా బతికిన కుటుంబం కూడాకాదు. ఆయనకి మగ సంతానంలేదు. ఇద్దరు కూతుళ్ళు అనసూయ లలిత, వయస్సులో వాళ్ళిద్దరికీ ఏడాదిన్నరి తేడా ఉన్నా వాళ్ళిద్దరిదీ ఒకటే పోలిక, పరిచయం లేనివాళ్ళు పొరబడేటంత పోలిక.

వాళ్ళకి మంచి సంబంధాలు చూసి పెళ్ళి చెయ్యగల స్తోమత శ్రీపతిగారికి లేదు. అక్కడే కొంత అదృష్టం కలిసి వచ్చింది. ఆ వూళ్ళోబాగా ధనవంతుల్లో ఒకరైన గంగాధరంగారి అబ్బాయి వెంకటరమణ అనసూయ అంటే యిష్టపడ్డాడు మంచి నీళ్ళ రేవుదగ్గిర చూశాడుట, ఆ అమ్మాయినే పెళ్ళి చేసుకుంటానని పట్టు బట్టాడు. మొదట్లో బింకం చూపించినా కొడుకు పట్టుదలచూసి ఆయన ఒప్పుకున్నాడు.

ఆయన పట్టి ఆస్థిమనిషి. అమ్మాయి అందమైనదీ, గుణవంతురాలూ అయినా ఆ విషయానికి ఆయన ప్రాధాన్యత యివ్వలేదు. వంశాన్ని నిలుపుకునే ప్రయత్నంతో సహకరించడమే స్త్రీ ఉపయోగం అని ఆయన భావం, తన భార్యనలాగే చూశాడు భార్య, చెల్లెలు, కోడలు ఇలాంటి మమకారాలు ఆయన కేవీ ఉండవు.

ఆయన ఆలోచించినది వేరు. కొడుక్కి ఈడుకి తగని ఆలోచనలున్నాయి. ఎప్పుడూ హరికథలూ, పూజలూ, రామకోటి సప్తాహాలూ – ఇలాంటి వాటిలో మునిగి పోయి ఉంటాడు. పెళ్ళి చేసుకోవాలన్న ఉద్దేశం అనసూయని చూశాక కలిగింది. వాళ్ళిద్దరికీ త్వరగా ఒక మగబిడ్డ కలిగి వంశం నిలబడితే ఆస్తికి వారసుడు దొరుకుతాడని ఆయన ఆలోచన. అన్న కొడుకులకి ఆస్తి ఇవ్వటం ఆయనకి ఇష్టం లేదు అంతస్తులో చాలా తక్కువయినా ఆయన ఈ సంబంధానికి ఒప్పుకున్న కారణం అదే. అనసూయని కాకపోతే ఇంకొకర్ని చేసుకోనని కాశీ వెళ్ళిపోతానని కొడుకు అనేసరికి ఆయన ఒప్పుకున్నాడు.

అదే పెళ్ళిపందిట్లో లలిత పెళ్ళికూడా జరిగింది. పక్కఊరు శ్రీపురం ఇచ్చారు ఆమెని. చాలా మామూలు సంబంధం! రెండు విభిన్నమయిన కళ్యాణ వేదికలమీద పెళ్ళిళ్ళు జరిగాయి

లలిత దురదృష్టవంతురాలు. వివాహం

అయినా ఆరు నెలలలోనే ఆమె భర్త పొలం దగ్గిర పాము కరిచి చచ్చిపోయాడు. అప్పుడామె గర్భవతి.

అనసూయకూడా గర్భవతే. ఇద్దరినీ శ్రీపతిగారు ఇంటికి తీసుకువచ్చారు. భార్యావిహీనుడు కావటంవల్ల కూతుళ్లిద్దరి అవసరాలలోనూ పక్కింటావిడ సహాయం చేస్తూ వచ్చింది.

అనసూయకీ లలితకీ ఒకేసారి నొప్పులు వచ్చాయి. హడావిడిగా మంత్రసానికోసం పంపించారు. ఆ వూళ్లో ఉన్నది యిద్దరు మంత్రసానులు, కాంతమ్మ రత్తమ్మ. అని. కాంతమ్మకేవిూ ప్రత్యేకత లేదుగాని రత్తమ్మకి ఒక అపప్రథ ఉండేది. ఆవిడ సహాయం చేసిన కాన్పుల్లో బిడ్డగాని, తల్లిగాని పోవడం జరిగింది. ఆవిడ హస్తవాసి మంచిదికాదని అనుకునేవారు.

సమయానికి కాంతమ్మ ఊళ్లో లేకపోవడంతో రత్తమ్మనే పిలిపించారు.

ఆడదిక్కులేని ఆ యింట్లో అంతా రత్తమ్మే చూడాల్సి వచ్చింది. గంటన్నర తేడాలో రెండు కాన్పులూ సుఖంగానే జరిగాయి. ఇద్దరికీ మగబిడ్డలే ఒకటేరూపం పోల్చుకోలేనంత పోలిక ఇద్దరికీ శ్రీపతిగారి పోలికే వచ్చిందన్నారు.


అయితే రత్తమ్మ చెయ్యి నిజంగానే మంచిది కాదేమో తెలియదు. ఇద్దరు బిడ్డల్నీ ఒక ఉయ్యాలలో పడుకోబెట్టి

# శ్రీపతి

పుట్టుమచ్చలు చూస్తుంటే ఒకబిడ్డకి ఎక్కిళ్లు రావటం ప్రారంభించాయి. ఊపిరి అందుకోలేకపోతోంటే రత్తమ్మ గాభరాగా చూసింది. 'ఎవరినైనా పిలుద్దా' మనుకుంటుండగానే శిశువుకి ఎగశ్వాస వచ్చింది. క్షణంలో కళ్లు తేలిపోయి ప్రాణం పోయింది.

రత్తమ్మకి గుండెలు పిండినట్లయింది. మరణించిన బిడ్డని కళ్లనీళ్లతో చూసింది. కేకలు వెయ్యలేదు. ఎవర్నీ పిలవలేదు. నిశ్చేష్టగా నిలబడి పోయింది—తన దురదృష్టానికి మరో బిడ్డ బలి అయిపోయినందుకు.

చూస్తుండగానే రెండో బిడ్డకి ఎక్కిళ్ళు ప్రారంభం అయాయి. ఊపిరికి కష్టపడుతున్నాడు. రత్తమ్మకి కాళ్లాడలేదు కళ్లల్లోంచి నీళ్లు జలజలాకారాయి. క్షణంలో నిశ్చయానికి వచ్చేసింది. తను దూరంగా వెళ్లిపోతేగాని బిడ్డకి రక్షణ లేదనుకుంది. ఉన్నపళంగా ఎవరికీ చెప్పకుండా ఇంట్లోంచి బయటికి వచ్చేసింది. జటకా కట్టించుకుని కట్టుబట్టల్తో పట్నం వచ్చేసింది. పట్నంలో దొరికిన రైలు ఎక్కేసింది. తనగాలి సోకనంత, తన ఆలోచనలు అందనంత దూరం పోతేగాని బిడ్డకి క్షేమం లేదనుకుంది.




పనిమీద యింటికి వెళ్ళొచ్చిన పక్కింటావిడ వస్తూనే ఉయ్యాలలో ఒకబిడ్డ చచ్చిపోయి ఉండటం గమనించింది. రత్తమ్మలేదు. క్షణంలో అంతా గందరగోళం అయిపోయింది. చుట్టుపక్కల అమ్మలక్కలంతా వచ్చారు. రత్తమ్మకోసం వెతికారు. కనబడలేదు. ఏమయింది బిడ్డకి అన్నారు' ఇప్పటిదాకా బాగానే ఉన్నాడే' అని కొందరన్నారు 'రత్తమ్మది నిర్భాగ్యపు చెయ్యి' అన్నారు. ఎలా పోయాడు? అని ప్రశ్నించుకున్నారు. ఇంతకీ పోయింది ఎవరిబిడ్డ? అన్నారు.

అదే తేలలేదు. ఇద్దరు బిడ్డలదీ ఒకటే పోలిక. ఆడమనిషిలేని ఆ యింట్లో వాళ్లని పోల్చగలిగినది రత్తమ్మ ఒక్కర్తే అయింది. ఆమె కనబడకుండా పోయింది. ఇరుగుపొరుగు అమ్మలక్కలు ఏకాభిప్రాయానికి రాలేదు.

అనసూయకిగాని, లలితకిగాని పుత్రశోకం కలగలేదు. మరో యిల్లాలి బిడ్డ పురిట్లో పోయినట్లు వింటే ఎలా బాధ కలుగుతుందో అలాగే కలిగింది. ఇద్దరికీ కళ్లల్లోకి నీళ్లు వచ్చాయి. కాని భరించరాని వేదనతో విల విల లాడలేదు. భవిష్యత్తు శూన్యంగా అయోమయంగా కనిపించలేదు. బతికినబిడ్డ బోసినవ్వు నవ్వుతోంటే ఇద్దరికీ గుండెలు ఉప్పొంగాయి. ఇద్దరికీ తన బిడ్డలాగానే కనిపించాడు పసికందు. తనబిడ్డ చచ్చిపోయి ఉండవచ్చనే భావనే మనసులోకి రానీయలేకపోయారు ఆ అప్పచెల్లెళ్లలో ఎవరూ. ఇద్దరిస్తన్యం తీసుకున్నాడు పసిబిడ్డ.

బారసాలనాడు పీటలమీద వెంకటరమణ అనసూయ కూర్చున్నారు. వెంకటరమణ ఆలోచించి బియ్యపు పళ్ళెంలో 'శ్రీపతి' అని రాశాడు. అనసూయకీ లలితకీ కృతజ్ఞతతో కళ్ళు చెమ్మగిల్లాయి

తల్లీతండ్రీ ఉన్న కుటుంబంలోనే బిడ్డ పెరగటం సమంజసంగా తోచింది శ్రీపతిగారికీ, లలితకీ కూడా. అనసూయ వెంకటరమణల దగ్గిరే పెరిగాడు శ్రీపతి. కాలవగట్టు స్కూల్లో ఒకటో తరగతిలో వేస్తున్నప్పుడు తల్లిదండ్రుల పేర్లుగా అనసూయ, వెంకటరమణ అని నమోదు చెయ్యబడ్డాయి.

ఎదుగుతున్న కొద్దీ అతనిలో తాత

శ్రీపతిగారి పోలికలే ప్రస్ఫుటంగా కనబడ సాగాయి.

ఎలిమెంటరీ స్కూలు అయిన తర్వాత మామయ్య జగన్నాథంగారి దగ్గరకి వచ్చి చదువుకున్నాడు. బి.ఎ. పాసయ్యాడు. ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు.

* * *

శ్రీపతి శ్రీపురం చేరుకునేటప్పటికి పదిగంటలు దాటింది. అమ్మ తాతయ్య దగ్గిరే ఉందని తెలిసి అక్కడికే వెళ్లాడు. కొడుకుని చూడగానే అనసూయమ్మకి ప్రాణం లేచివచ్చింది. వెంటనే కుంపటి రాజేసి కాఫీకాచి యిచ్చింది. అప్పుడే వేడి నీళ్ళుకూడా పెట్టింది. స్నానం చేసిన తర్వాత భోజనం పెట్టింది. కొడుక్కి యిష్టమని గుత్తి వంకాయకూర చేసింది. అన్నం తింటూంటే విసినికర్ర తీసుకు విసిరింది.

మామయ్య అత్తయ్య, వర్ధని విశేషాలు అడిగింది. మామయ్య ఆరోగ్యం బాగుందనీ, వర్ధని అయిదో ఫారం చదువుతోందనీ చెప్పాడు.

'అమ్మదగ్గరికి ఎప్పుడు వెడతావురా' అంది అనసూయమ్మ.

'రేపు వెడతానమ్మా' అన్నాడు.

ఆ మధ్యాహ్నం అంతా యింట్లోనే గడిపాడు. అటకమీద సామానంతా దించి దుమ్ముదులిపాడు. అలా తీస్తుంటే పాత కాలంనాటి ఉయ్యాల కనబడింది. కొంచెం పెద్ద ఉయ్యాల. ఇద్దరు బిడ్డల్ని పడుకో బెట్టవచ్చు. 'నాతోపాటు నా అన్నో, తమ్ముడో దీంట్లో పడుకున్నాడు' అనుకున్నాడు శ్రీపతి.

సాయంత్రం చెరువు ఒడ్డుకి బయలుదేరాడు. ఇల్లు కదలగానే పక్కసందులోనే ఉంది రత్తమ్మ యిల్లు.

పాడుపడిపోయి ఉంది. రత్తమ్మ హఠాత్తుగా ఊరువిడిచి వెళ్లిపోయాక ఆ యింటిని అలాగే ఉంచారు. ఎవరూ ఆక్రమించుకోలేదు. ఇంకొకళ్ల యిల్లు మనకెందుకనో, రత్తమ్మ హస్తవాసిలాగానే ఆమె యిల్లుకూడా మంచిది కాదనో తెలియదు. ఆ యింట్లో దీపం పెట్టి చాలా ఏళ్ళయినట్టు స్పష్టంగా తెలుస్తోంది. బూజు పట్టి గోడలునగం పడిపోయి. పిచ్చి మొక్కలు పెరిగి పూర్తిగా జీర్ణావస్థలో ఉంది. 'రత్తమ్మ తిరిగివస్తే ఈయింట్లో ఉండగలదా?' అనుకున్నాడు శ్రీపతి. 'అసలు రత్తమ్మ తిరిగి వస్తుందా?' అన్న ఆలోచనకూడా వచ్చింది.

చెరువు ఒడ్డుకి వెళ్లి కాసేపు మంచి గాలి పీల్చి చీకటి పడుతోంటే యింటికి చేరుకున్నాడు. అప్పటికి అనసూయమ్మ ఇల్లు కడిగి గుమ్మాలకి పసుపురాస్తోంది.

'రత్తమ్మ యిలు' బాగా పాడయి పోయిందే' అన్నాడు అన్నం తింటున్నప్పుడు తల్లితో,

పరధ్యానంగా ఉన్న అనసూయమ్మ ఉలిక్కి పడింది. 'ఏమిటి రత్తమ్మంటు న్నావు' అని అడిగింది కంగారుగా.

'రత్తమ్మ యిల్లు బాగా పాడయి పోయిందికదా అన్నాను అన్నాడు.

'అవును' అంది అనసూయమ్మ నిట్టూరుస్తూ.

* * *

మర్నాడు శ్రీపురం బయలుదేరాడు. జటకా కట్టించుకుంటే గంట ప్రయాణం. శ్రీపతికి జటకా ప్రయాణం కొత్తకాదు. ఆ కుదుపులు అలవాటే.



FDSAS1664TE

శ్రీపురంలో యింటికి చేరుకునే సరికి పొద్దున్న ఎనిమిదిన్నరయింది.

కొడుకుని చూసేసరికి లలితమ్మ ముఖం వికసించింది. సంచీ అందుకుని లోపల పెట్టింది. కాఫీ యిచ్చి తాగుతోంటే 'చిక్కిపోయావేమిరా' అంది.

శ్రీపతి ఒళ్ళు చూసుకుని 'బాగానే ఉన్నానే' అన్నాడు.

స్నానానికి లేస్తోంటే 'తలంటి పోసుకుని దిన్నాళ్ళయిందిరా' అంది. శ్రీపతి నవ్వి 'రెండు నెలలపైన అయింటుందమ్మా' అన్నాడు.

'అత్తయ్య పొయ్యలేదా?'

'లేదు. పోసుకోమని అడగదు'

'వర్ధని?' అంది లలితమ్మ నవ్వి.

శ్రీపతికూడా నవ్వి ఊరుకున్నాడు.

మంచినూనె చిన్న ఉద్ధరిణెలో యిచ్చి రాసుకోమని సున్నిపిండిలో నీళ్ళుకలిపి పక్కన పెట్టింది. రెండు చెవులలోనూ నూనెపోసింది. సున్నిపిండితో నలుగు పెట్టు కుంటోంటే కుంకుడు కాయలు కొట్టి పులుసు కలిపింది.

'అమ్మనిచూసి వచ్చావుట్రా!' అని అడిగింది పులుసుపోస్తూ.

'అక్కణ్ణించే వస్తున్నాను' అన్నాడు శ్రీపతి. కొడుకువొళ్ళు రుద్దుకుంటోంటే వీపు రుద్దింది లలితమ్మ. తలతుడుచు కున్నాక కొడుకు కంట్లో పులుసు పడిం దంటే రెండు ఉప్పురాళ్లిచ్చి నోట్లో వేసుకుని చప్పరించమంది,

## శ్రీపతి

శ్రీపతికి ఇష్టమని గారెలు చేసింది. చేస్తోంటే శ్రీపతి పెరట్లో మొక్కలకి, పాదులకీ ఒరవలుచేసి బావిలోంచి నీళ్ళుతోడి పోశాడు, తర్వాత టిఫినుకోసం బాదంచెట్టు ఎక్కి ఆకులుకోశాడు. లలితమ్మ కొడుకు చేత గారెలు దగ్గిరుండి తినిపించింది.

'మామయ్య నీ పెళ్ళి సంగతి ఏమంటు న్నాడ్రా!' అంది.

'మామయ్య మాటేం చెల్లుతుంది? అంతా అత్తయ్య యిష్టంగదా?' అన్నాడు.

'అత్తయ్య ఏమంటుంది?'

'కొత్తేముంది? మనం వాళ్ళ అంతస్తుకి తగని వాళ్ళమేగదా. కొత్తగా డబ్బు మన వళ్ళో కురిసింది ఏమీలేదుగదా' అన్నాడు.

రెండు రోజులుండి అమ్మని తీసుకుని లక్ష్మీపురం తిరిగివచ్చాడు. వచ్చేసరికి మామయ్య అత్తయ్య, వర్ధనికూడా వచ్చారు. మామయ్య పొలం విషయంలో వస్తే నేనూ వస్తానంది వర్ధని. తను ఒక్కర్తీ ఎందుకని కామాక్షమ్మకూడా వచ్చింది.

జగన్నాథంగారు వచ్చిన రోజునే గంగా ధరంగార్ని చూడటానికి వెళ్ళారు. ఆయన ఆరోగ్యం బాగాపాడయిపోయింది. నీరసం, నిస్సత్తువ. పూర్తిగా స్వార్జితమయిన తన ఆస్తి విషయం ఆయన ఏదో ఒకటి తేల్చెయ్య దలుచుకున్నాడు. శ్రీపతి తన కొడుకు కొడుకేనని తేలితే తన ఆస్తి అంతా అతనికి రాసిచ్చెయ్యాలనీ, తేలకపోతే తన వంశం వాళ్ళయిన అన్న కొడుకులకి రాసియ్యాలనీ నిశ్చయం చేసుకున్నాడు. ఆ విషయమే జగన్నాథంగారితో చెప్పాడు.


శ్రీపతి లలితమ్మని తీసుకుని ఇంటికి వచ్చేటప్పటికి జగన్నాథంగారు భార్యతో ఆ విషయం చెప్పటం వినిపిస్తోంది.

'ఏదో విధంగా తెలిస్తే బాగుండును. అంత ఆస్తి శ్రీపతికే వస్తే, మా అన్నయ్య కొడుకూ లేరు ఎవరూలేరు — శ్రీపతికే వర్ధనిని యిచ్చి చేసేస్తాను. ఆ రత్తమ్మ తిరిగొస్తే బాగుండును' అంటోంది కామాక్షమ్మ.

శ్రీపతి లోపలికి వెళ్ళేసరికి అనసూయమ్మ పాతఫోటోలున్న పెట్టి సర్దుతోంది. శ్రీపతి పక్కనుండి ఫోటోలన్నీ చూస్తూ ఒకఫోటో బయటికి తీసి పట్టి పట్టి చూశాడు.

అది గంగాధరంగారి చిన్నప్పటి ఫోటో, దాదాపు ఏభై ఏళ్ళ క్రితం ఫోటో, అప్పటికీ యిప్పటికీ పోలికేలేదు. ఇప్పుడు డెబ్బై ఏళ్ళ ముసలివాడు. అప్పుడు ఇరవై ఏళ్ళ యువకుడు. ఇప్పుడు బట్టతల ఆయనకి, అప్పుడు ఒత్తుజుట్టు ఉంది. ఆ ఫోటోలో నుదుటిపైన పడేజుట్టులో సుడిఉంది. ఆ ఫోటోనే చాలాసేపు చూశాడు శ్రీపతి. చూస్తోంటే అతని నుదుటిమీద ముడతలు పడ్డాయి. కనుబొమలు ముడుచుకున్నాయి. కాసేపాగి అద్దంలో చూసుకున్నాడు.

నాలుగురోజుల తర్వాత సూర్యుడు మామూలుగానే ఉదయించిన ఒకరోజున



రత్తమ్మ యింటిముందు జటకా ఆగింది. దాంట్లోంచి రత్తమ్మ దిగింది.

ఆసరా లేకుండా నడవలేనిస్థితిలో ఉంది. శక్తి అంతా ఉడిగిపోయి గంటలు లెక్కపెట్టుకునే స్థితిలో ఉంది. ఆఖరిక్షణాలు స్వంతవూరిలో, పరిచయమైన నేలమీద; తనకి తెలిసిన మనుషులమధ్య గడపాలని వచ్చింది. తన హస్తవాసికి శ్రీపతిగారి రెండోమనవడు బలి కాలేదన్న సంతోష వార్త తెలుసుకోవచ్చునన్న ఆశతోటీ, శ్రీపతిగారి మనవడిగురించి బహుశా తనకి మాత్రమే తెలిసిఉన్న విషయం చెప్పవలసిన నైతిక బాధ్యతతోటీ వచ్చింది.

జట్కావాడు ఆమెకి ఆసరా యిచ్చి దింపాడు. ఆమె అడుగు వెయ్యలేక పోతోంటే ఇంటిలోపలికి నడిపించాడు. తలుపుతీసి తన బండిలో గుడ్డ దీసి పరిచాడు ఆమె మాట్లాడగల స్థితిలో లేదు. అతికష్టంమీద నోరు పెకలించుకుని 'శ్రీపతి గారు' అంది. జట్కావాడు ఇల్లు కనుక్కొని వచ్చేసరికి ఇంట్లో శ్రీపతి, వర్ధని ఉన్నారు శ్రీపతి జట్కావాడిద్వారా విషయం కనుక్కొని దారిలో వైద్యుడియింట్లో కబురు పెట్టి, వెంటనే రత్తమ్మ యింటికి రమ్మని చెప్పి రత్తమ్మ యింటికి బయలుదేరాడు.

శ్రీపతీ, వర్ధనీ అడుగు పెట్టేసరికి రత్తమ్మ ఎగశ్వాసతో ఉంది. శ్రీపతిని కళ్లు చిట్లించి చూసి పోల్చుకుంది. పట్టలేని ఆనందంతో ఆమెకళ్లు మెరిశాయి. కళ్లనీళ్లతో అతనిచేతులు పట్టుకుని ఆప్యాయంగా నిమిరింది, వెంటనే ఏదో గుర్తుకు వచ్చినట్టు తనసంచీ చూపించి పక్కకి జరిగింది. ఆ సంచిలో అంటించిన కవరుఉంది దానిమీద 'శ్రీపతి గారి బతికిఉన్న మనవడికి' అని రాసి ఉంది. అది అలాగే జేబులో పెట్టుకున్నాడు శ్రీపతి.

రెండుక్షణాల్లో వైద్యుడు, కామాక్షమ్మ, జగన్నాధంగారు, శ్రీపతిగారు, రత్తమ్మనిగురించి తెలిసిన పాతతరం మనుషులు చాలమంది వచ్చారు. కామాక్షమ్మ ఆత్రంగా రత్తమ్మ దగ్గరకి రాబోతోంటే వైద్యుడు వారించాడు. రత్తమ్మకి గాలి తగిలేటట్టుగా చేసి నాడి చూశాడు. వెంటనే పెదవి విరిచాడు. రత్తమ్మ అందర్నీ చూస్తూ గుర్తుపట్టడానికి ప్రయత్నిస్తుండగానే ఆమె ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.

ఆమెకి దహనక్రియలు అన్నీ శ్రీపతే చేశాడు, శవం కాలుతోంటే శ్రీపతి అంటించిఉన్న ఆ కవర్ని జేబులోంచి తీసి ఆ మంటల్లో వెయ్యడం గమనించింది వర్ధని. 'నువ్వు చెప్పదామనుకున్న రహస్యం శాశ్వతం, నీలోనే ఉంచుకో రత్తమ్మవ్వా' అనడం వింది.

శ్రీపతి ముఖంలో చెక్కుచెదరని ప్రశాంతతనీ, పెదవులపై స్వచ్ఛమైన చిరునవ్వునీ చూసింది వర్ధని ●

రసవర్గాలూ - గుణాలూ :

# మజ్జిగ

ఆవు మజ్జిగ మేహశాంతిని, పైత్య శాంతిని చేకూరుస్తుంది. అగ్నిదీప్తినిస్తుంది. త్రిదోషహరమైనది. ఇది మిక్కిలి పథ్యమయినది. ముఖ్యంగా ఆవగాతిసారం, ఉబ్బు, గ్రహణి, పాండువు, మేహం, గుల్మం, ఉదరం, మూలవ్యాధి, కామెల, పైత్యం, పురాణజ్వరం, అరుచి, శోష, క్షయ, శీతపైత్యంగల రోగులకు మిక్కిలి పత్యమయినది.

గేదె మజ్జిగ కామిల, పాండురోగ్యం, కఫరోగం, రక్తం స్రవించే మూలవ్యాధి— ఈ రోగాలు గలవారికి పథ్యమయినది. దేహపుష్టినిస్తుంది. వాతరోగాన్ని పెంపొందిస్తుంది

మేకమజ్జిగ త్రిదోషహరమైనది. జఠర దీప్తినిస్తుంది. గుల్మం మూలవ్యాధి, సంగ్రహణి, పాండువు, మేహపైత్యం, జలోదరంగల వారికి పథ్యమయినది.

అసలు సాధారణంగా ఏ జంతువుయొక్క పాలతోచేసిన మజ్జిగైనా చలవచేసి నీరు పెంచుతుంది. కఫవాతాన్ని అణచివేస్తుంది ఉబ్బు, ఉదరం, మూలవ్యాధి, గ్రహణి, మూత్రబద్ధం, అరుచి, గుల్మం, కడుపులోబల్ల, కామిల, హృద్రోగం, పాండువు, క్షయ— ఈ రోగాల్ని ఉపశమింపజేస్తుంది. మార్గాయాసాన్ని పోగొడుతుంది. రక్తంలోని వేడిని తీసివేస్తుంది.

ఇనుపగుండ్లుగాని మేకుగాని, కాల్చి మజ్జిగలోవేసి— ఆ మజ్జిగను వడగట్టి త్రాగితే జీర్ణశక్తి పెంపొందుతుంది. రాగం కాల్చి మజ్జిగలో వేసి—ఆ మజ్జిగను త్రాగితే పైత్యంవల్ల అయ్యే రక్తవిరేచనాలు కడతాయి. బియ్యం కొద్దిగా వేసి, మజ్జిగతో వండిన అన్నం తింటే రాకవిరేచనాలు కడతాయి.

ప్రతిరోజూ అమితంగా టీ త్రాగడంవల్ల నరముల వికలత్వం సంభవించినవారు, రోజూ రెండుపూటలూ ప్రశస్తమైన మజ్జిగను అన్నంతో కలుపుకొని తినడం మంచిది. క్షయ జబ్బు ప్రారంభదశలో గలవారు రోజూ ఉదయాన్నే పరిశుభ్రమైన మజ్జిగను తగ్గ మోతాదులో త్రాగుతే ఎంతో మేలు చేకూరతుంది.

తియ్యని మజ్జిగ పైత్యాన్ని శమింపజేస్తుంది. పుల్లటి మజ్జిగ వాతాన్ని శమింపజేస్తుంది. వెగటుగా ఉన్న మజ్జిగ శ్లేష్మాన్ని శమింపజేస్తుంది.

వాతరోగులు పులిసిన మజ్జిగను సైంధవ లవణంతోను, పైత్యరోగులు తియ్యటి మజ్జిగను పంచదారతోను— శ్లేష్మరోగులు వగరుగా నున్న మజ్జిగను శొంఠి పిప్పిలి మిరియాలు, ఏలకులు, ఆకుపత్రికం, లవంగాల చూర్ణంతోను— గ్రహణిరోగులు— ఉప్పుతోను— మూత్రకృచ్ఛం గలవారు బెల్లంతోను— పాండురోగులు శొంఠి చూర్ణంతోను— మూలవ్యాధిగలవారు కొడిశచెక్క చూర్ణంతోను— ప్రమేహంగలవాళ్ళు తేనెతోను మజ్జిగను పుచ్చుకోడం మంచిది.

మజ్జిగను పది విధాలుగా చెయ్యవచ్చును. చేసే విధానానికి అనుగుణంగా కించెత్తు గుణాలు కూడా మారుతూంటాయి.

శ్లేష్మతత్వం, వాతతత్వం గలవాళ్ళు, దంతరోగులు, ఉబ్బు వ్యాధి గలవారు, ప్రసవమైన స్త్రీలు, రక్తక్షీణదేహులు, గాయములు తగిలినవారు— మూర్ఛ, నవజ్వరం, వాతశ్లేష్మజ్వరం, రక్తపైత్యం, కార్శ్యరోగం గలవారు అధికంగా మజ్జిగ త్రాగకూడదు.

కొన్ని రకాల జబ్బులు గలవారు మజ్జిగను అమితంగా పుచ్చుకుంటే— శ్లేష్మం, వాతం, అగ్నిమాంద్యం, అజీర్ణం, తలత్రిప్పు, జ్వరం మొదలగు వ్యాధులు వస్తాయి.

మజ్జిగయొక్క దుర్గుణాలకువిరుగుళ్ళు:— 1. ఉప్పు, 2. శొంఠి, 3. సైంధవ లవణం, 4. శంఖభస్మం, 5. అల్లం, 6. కాకజంఘధములు.

సేకరణ ఆకుండి నారాయణమూర్తి